ఈనాడు
అమరావతి
కృష్ణా
శనివారం అక్టోబరు 12, 2024

విశ్వవినోదిని.. విష్ణువిలాసిని


మహిషాసురమర్దిని అలంకారంలో ఉన్న దుర్గమ్మను దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



ఇంద్రకీలాద్రి శోభాయమానమైంది. శరన్నవరాత్రి ఉత్సవాల తొమ్మిదో రోజు జగన్మాత.. మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మ దర్శనంతో సకల శుభాలు చేకూరతాయనీ... ధైర్యం, స్థైర్యం, విజయం సిద్ధిస్తాయనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. శుక్రవారం వేకువజామున 4 గంటల నుంచి రాత్రి 11 వరకూ భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దుర్గగుడిలో దసరా ఉత్సవాలు నేటితో ముగియనున్నాయి.


విద్యుత్తు కాంతుల్లో హంసవాహనం


నృత్య నీరాజనం


తల్లీ వందనం


అంతరాలయంలో పూలతో అలంకరణ


కనకదుర్గానగర్‌లో భక్త సంద్రం


కుంకుమార్చనలో..

వెంకన్న తరఫున పట్టువస్త్రాలు


తితిదే బృందానికి స్వాగతం పలుకుతున్న ఈవో

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : జగన్మాత దుర్గమ్మకు తితిదే తరఫున పట్టు వస్త్రాలను శుక్రవారం సమర్పించారు. తితిదే ఏఈవో దొరస్వామి నేతృత్వంలో పట్టు వస్త్రాలు తీసుకువచ్చిన బృందానికి ఈవో రామారావు, వైదిక కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వైదిక కమిటీ సభ్యులు వాటిని స్వీకరించారు.

పెడనలో హైటెక్ జూదం

పెడన, న్యూస్‌టుడే: పెడన మండలం కొంకేపూడిలో హైటెక్ జూదం నడుస్తోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న కొంత మంది ప్రముఖులు ఈ గ్రామంలో జూదాన్ని భారీ స్థాయిలో నిర్వహిస్తున్నారు. రోజుకు దాదాపు రూ.20లక్షలకు పైగా లావాదేవీలు జరుగుతున్నట్లు తెలిసింది. కొంకేపూడి గ్రామం పెడనకు 3 కి.మీ దూరంలో ఉంటుంది. వివిధ ప్రాంతాల నుంచి ఖరీదైన కార్లలో వస్తున్న ప్రముఖుల్ని పెడన నుంచి బైక్‌పై తీసుకెళ్లి జూదాలు ఆడిస్తున్నారు. సదరు వ్యక్తుల కార్లను పెడనలోని వివిధ ప్రాంతాల్లో పార్కింగ్ చేయిస్తున్నారు. పట్టపగలు నివాస సముదాయాల మధ్య జరుగుతున్న ఈ జూదం పోలీసు అధికారుల పనితీరుకు నిదర్శనంలా మారింది.



నాడు చక్రం తిప్పిన నేతలే..

గత ప్రభుత్వంలో పెడన నియోజకవర్గంలో జూదాలు భారీగా నడిచాయి. అప్పట్లో వైకాపా ముఖ్య నేత ప్రోద్బలంతో పెడనలోని పల్లెల్లో యథేచ్ఛగా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. అప్పట్లో చక్రం తిప్పిన నేతలే తిరిగి జూదాలకు ఆద్యం పోస్తున్నారు. కొంకేపూడి జూద కేంద్రానికి పటిష్ఠ సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకుని ఈ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. అటువైపుగా ఎవరైనా కొత్త వ్యక్తులు వెళితే వెంటనే సెల్‌ఫోన్లలో అప్రమత్తం చేస్తున్నారు. ఈ జూదాల్లో స్థానికుల పాత్రపై విమర్శలు వస్తున్నాయి. ఒప్పంద పద్ధతిపై పనిచేసే ఒక ఉద్యోగితో పాటు మరికొందరు తోడ్పాటు అందిస్తున్నట్లు సమాచారం. రాజకీయ ఒత్తిళ్లతోనే పోలీసులు అటువైపు చూడడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై పెడన రూరల్ సీఐ నాగేంద్రప్రసాద్ స్పందిస్తూ కొంకేపూడిలో జూదాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి రాలేదని, దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకొస్తామన్నారు.

విజయ దశమికి రాజరాజేశ్వరీదేవి రూపం..

ఇంద్రకీలాద్రి, చిట్టినగర్ : దసరా శరన్నవరాత్రుల్లో నేడు దుర్గమ్మ రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమివ్వనుంది. రాజరాజేశ్వరీదేవి దివ్యదర్శనంతో జీవితం ధన్యమవుతుంది.

దర్శన వేళలు

వేకువజామున 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు

అన్నీ ఉచిత లైన్లే..

విజయదశమి రోజు వీఐపీ, వీవీఐపీ, టిక్కెట్ల దర్శనాలు లేవు. అన్ని లైన్లు ఉచిత దర్శనమే.

వరద బాధితులకు రామోజీ గ్రూప్ అండ

1000 మందికి నూతన వస్త్రాలు పంపిణీ

అంబాపురం(రామవరప్పాడు), న్యూస్‌టుడే : బుడమేరు ఉగ్రరూపంలో సర్వం కోల్పోయిన వరద బాధితులకు రామోజీ గ్రూప్ అండగా నిలిచింది. విజయదశమి సందర్భంగా కృష్ణాజిల్లా విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలో శుక్రవారం 1000 మంది బాధితులకు 'మార్గదర్శి' ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది దసరాకు నూతన వస్త్రాలు కొనుగోలు చేసేవారమని, కానీ గత నెలలో వచ్చిన వరదలతో ఇళ్లన్నీ మునిగిపోయి ఆర్థికంగా నష్టపోయామని బాధితులు వాపోయారు. పండగ రోజున రామోజీ గ్రూప్ తరఫున తమకు వీటిని అందజేయడం ఆనందంగా ఉందని గ్రామస్థులు పేర్కొన్నారు. రామోజీ గ్రూప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు. మార్గదర్శి మేనేజర్లు వెంకటేష్, కృష్ణమోహన్, కళాంజలి మేనేజరు వెంకటేష్, ఈనాడు, మార్గదర్శి, కళాంజలి సిబ్బందితో పాటు స్థానికులు గొడ్డళ్ల చిన రామారావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.


మహిళకు దుస్తులు అందిస్తున్న మార్గదర్శి మేనేజర్లు సోంపల్లి వెంకటేష్, కృష్ణమోహన్, కళాంజలి మేనేజరు వెంకటేష్


నూతన వస్త్రాల కోసం బారులు తీరిన మహిళలు

సిండికేట్లదే పైచేయి

★ జిల్లాలో 2,882 దరఖాస్తులు
★ గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల్లో తక్కువ
★ పెనమలూరు మండలంలోనూ ఇదే తీరు

ఈనాడు - అమరావతి

మద్యం దుకాణాల ఏర్పాటు కోసం జిల్లాలో సమర్పించిన దరఖాస్తుల్లో సిండికేటుదే పైచేయిగా కనిపించింది. పలు చోట్ల ప్రజాప్రతినిధులు, కీలక నాయకుల అనుచరులు కూటమి కట్టారు. ఫలితంగా ఎక్కువ దరఖాస్తులు రాలేదు. ప్రధాన ప్రాంతాల్లోనూ చాలా తక్కువ దరఖాస్తులే అందాయి. మచిలీపట్నం నగరంతో పాటు రెండు, మూడు మండలాలు మినహా ఎక్కడా ఆశించిన మేర స్పందన లేదు. అర్ధరాత్రి తర్వాత కానీ సంఖ్యపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. వచ్చిన దరఖాస్తుల నుంచి సోమవారం డ్రా తీయనున్నారు. మచిలీపట్నంలోని హిందూ కళాశాలలో డ్రా తీసి ఎక్సైజ్ అధికారులు లైసెన్సు అందజేయనున్నారు. 16వ తేదీ నుంచి ప్రైవేటు దుకాణాలు ఏర్పాటు కానున్నాయి.



కృష్ణా జిల్లాలో మద్యం దుకాణాల దరఖాస్తుల వివరాలివీ.. (రాత్రి 9 గంటల వరకు..)	
నోటిఫై చేసిన మద్యం దుకాణాలు ...	123
వచ్చిన దరఖాస్తులు ...	2,882
దరఖాస్తుల ద్వారా వచ్చిన రాబడి ...	రూ. 57.64 కోట్లు

ఒక్కో దుకాణానికి సగటున 23.43 దరఖాస్తులు

జిల్లాలో మొత్తం 123 మద్యం దుకాణాలను ఎక్సైజ్ శాఖ నోటిఫై చేసి దరఖాస్తులు ఆహ్వానించింది. శుక్రవారం రాత్రితో గడువు ముగిసింది. 9 గంటల సమయానికి 2,882 దరఖాస్తులొచ్చాయి. ఆన్‌లైన్‌తో పాటు జిల్లాలోని మచిలీపట్నం, అవనిగడ్డ, బంటుమిల్లి, మొవ్వ, గుడివాడ, నందివాడ, ఉయ్యూరు, గన్నవరంలోని ఎక్సైజ్ స్టేషన్లలో ప్రత్యక్ష పద్ధతిలో దరఖాస్తులు తీసుకున్నారు. ఒక్కో దరఖాస్తుకు రుసుం కింద రూ. 2 లక్షలు చొప్పున ప్రభుత్వం నిర్ణయించింది. తిరిగి ఇవ్వని ఈ ఫీజు ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ. 25.60 కోట్లు రాబడి జమ అయింది. ఒక్కో షాపునకు సగటున 23.43 దరఖాస్తులు అందాయి. జిల్లాలో అత్యధికంగా మచిలీపట్నంలోని 3వ దుకాణానికి 47, అత్యల్పంగా పామర్రు మండలంలోని 56, 58 దుకాణాలకు, గుడ్లవల్లేరు మండలంలోని 61వ షాపునకు పది చొప్పున వచ్చాయి.

★ మచిలీపట్నం నగరంలో ఐదు షాపులను నోటిఫై చేశారు. అన్నింటికీ 40 మందికిపైగా దరఖాస్తు చేశారు. కోడూరు, నాగాయలంక మండలాల్లోని దుకాణాలకు కూడా భారీగా వచ్చాయి. గుడివాడ నియోజకవర్గంలోని అతి తక్కువగా వచ్చాయి. పట్టణంలో ఏడు షాపులకుగాను ఒక్కోదానికి 10 నుంచి గరిష్ఠంగా 15 వరకు మాత్రమే దాఖలయ్యాయి. గుడివాడ మండలంలోనూ ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. రెండు దుకాణాలకు గాను ఒక్కో దానికి 12 చొప్పున వేశారు. ఇదే నియోజకవర్గంలోని గుడ్లవల్లేరు, నందివాడ మండలాల్లోని దుకాణాలకు దరఖాస్తుల సరళి ఇలాగే ఉంది. అరకొరగానే వచ్చాయి. చెన్నై - కోల్‌కతా జాతీయ రహదారి వెంబడి విస్తరించి ఉన్న గన్నవరం నియోజకవర్గంలోని షాపులకూ తక్కువే పడ్డాయి. ఈ మండలంలో 9 షాపులను నోటిఫై చేయగా.. ఒక్కో దానికి 20 లోపు మాత్రమే దాఖలయ్యాయి. ఈ నియోజకవర్గంలోని బాపులపాడు మండలంలోనూ 9 దుకాణాలకు 13 నుంచి 22 దరఖాస్తులే వచ్చాయి. తాడిగడప పురపాలిక పరిధిలోని మొత్తం మూడు షాపులకు స్పందన ఎక్కువగా కనిపించింది. ఒక్కో దానికి 50కిపైగా వచ్చాయి. పెనమలూరు మండలం విషయానికి వచ్చే సరికి అమాంతం పడిపోయాయి. ఒక్కో షాపునకు 20 దరఖాస్తుల్లోపే దాఖలయ్యాయి. ఇక్కడ సిండికేట్ల ప్రభావం ఎక్కువగా ఉంది.

మహిషాసురమర్దినీ పాహిమాం..

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: దేవీశరన్నవరాత్రుల సందర్భంగా వేమవరం కొండలమ్మ దేవస్థానంలో శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దినీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహార్నవమి పురస్కరించుకొని ఉదయం సహస్రనామ కుంకుమార్చన, సమస్త నదహోమ, శత్రుహోమ నివారణకు ప్రత్యంగిర, బగళా హవనములు, హోమం నిర్వహించారు. మధ్యాహ్నం తరకటారు, ఉదయకదుదు వారిచే భజన, రాత్రికి జైశ్రీవల్లీకల్యాణం నాటకం ప్రదర్శించనున్నట్లు ఆలయ కమిటీ కొండలరావు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖర్ దంపతులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.


అలంకారంలో అమ్మవారు

ముగిసిన మురళీ కోలాటం, తాళం భజన పోటీలు

ఘంటసాల, న్యూస్‌టుడే: చిట్టూర్పులోని మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో 9 రోజులుగా నిర్వహిస్తున్న కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలోని తాళం భజన, మురళీ కోలాటం పోటీలు శుక్రవారంతో ముగిశాయి. మురళీ కోలాటం పోటీల్లో ఘంటసాల, బోళ్లపాటు, చోరగుడి తదితర గ్రామాల భజన సమాజాలు పాల్గొన్నాయి. పోటీల్లో పాల్గొన్న భజన సమాజాలకు, గురువులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను నిర్వాహక కమిటీ సభ్యులు గుత్తికొండ వరప్రసాద్, వేములపల్లి సుధీర్, దాసరి సతీష్, దాసరి సురేష్ అందజేశారు.


మురళీకోలాటం గురువులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న వరప్రసాద్

బ్రాయిలర్ ధరలు (కిలో/రూ.లలో)



విజయవాడ: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -125 లైవ్ ధర 147 లెస్ స్కిన్ - 213, విత్ స్కిన్ - 243. [illegible]

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర [illegible]

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విజయవాడ రైల్వేస్టేషన్‌లో సంచలనం సృష్టించిన రైల్వే పోలీసు హత్య కేసు నిందితుడు పోలీసులకు చిక్కాడు. గుడివాడ సెక్షన్‌లోని ఎల్సీ గేటు నంబరు 41 వద్ద శుక్రవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. గురువారం తెల్లవారుజామున లోకో పైలెట్‌ను ఇనుప రాడ్డుతో దాడి చేసి హత్య చేయడంతో పాటు అదే రోజు మరో ముగ్గురిపై దాడి చేసి తప్పించుకు తిరుగుతున్నాడు. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు నిందితుడు రైల్వే పరిసరాల్లో తిరుగుతున్నట్లు నిర్ధారణకు వచ్చి అప్రమత్తం అయ్యారు. ఇతర స్టేషన్ల వారిని కూడా అప్రమత్తం చేశారు. ఈ క్రమంలో గుడివాడ రైల్వే స్టేషన్‌లో సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా నిందితుడిని గుర్తించి చాకచక్యంగా పట్టుకున్నారు. కాగా పోలీసుల దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. గంజాయి మత్తులో దాడులకు పాల్పడుతున్నట్లు బయటపడింది. నిందితుడు ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. మతిస్థిమితం లేదా నటిస్తున్నాడా అనే దానిపై కూడా విచారణ చేస్తున్నారు. నిందితుడిపై గతంలో ఏమైనా పాత కేసులు ఉన్నాయా అని వాకబు చేస్తున్నారు. ఇటీవల పక్క రాష్ట్రంలోని ఓ రైల్వేస్టేషన్‌లోనూ ఇదే తరహాలో ఇద్దరి వ్యక్తులపై దాడికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో బయటపడింది. అక్కడి నుంచి విజయవాడ వచ్చినట్లు తెలుస్తోంది. త్వరలో నిందితుడిని రైల్వే పోలీసులు మీడియా ముందు హాజరుపరిచే అవకాశం ఉంది.


లెవల్ క్రాసింగ్ గేటు దగ్గర నిందితుడు

మోదీ దేశాన్ని విశ్వ గురువు స్థానానికి తీసుకెళ్లారు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దారని భాజపా జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు పేర్కొన్నారు. మల్లాయపాలెం శ్రీలక్ష్మీనగర్ కాలనీలోని ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకురాలు బోణం గోపిక తన అనుచరులతో స్థానిక భాజపా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అంగడాల సతీష్ ఆధ్వర్యంలో శుక్రవారం భాజపాలో చేరారు. దీంతో వారిని కండువాలు కప్పి శ్రీరాజబాబు పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో పని చేసేవారికి సముచిత స్థానం కల్పించి ముందుకు తీసుకెళ్తామన్నారు. భాజపా పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ సూరే లక్ష్మీ నారాయణ(గాంధీ), ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొండపాటి శివాజీ, మాకాని జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.


భాజపాలో చేరిన వారితో శ్రీరాజబాబు తదితరులు

చెరువు కాదు.. జాతీయ రహదారే..!



పామర్రు మండలం కురుమద్దాలి శ్మశాన వాటికలకు సమీపంలోని అండర్‌పాస్ వద్ద నీరు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అయిదు రోజుల నుంచి ఉదయం వేళల్లో కురుస్తున్న వర్షాలకు నీరుపోయే మార్గం లేక నిలిచిపోయాయి. దీంతో చెరువును తలపిస్తుండగా ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్‌హెచ్ అధికారులు స్పందించి ఆ ప్రాంతంలో నీరు నిలిచిపోకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


నిలిచిన వర్షపునీటితో కురుమద్దాలి అండర్‌పాస్ వంతెన

– న్యూస్‌టుడే, పామర్రు గ్రామీణం

'ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం'

ఘంటసాల, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని మాలమహానాడు వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని రమేష్ తెలిపారు. శుక్రవారం దేవరకోట, ఘంటసాల అంబేడ్కర్‌నగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు, మాలమహానాడు అధ్యక్షుడు దివంగత పీవీ రావు చిత్రపటానికి నివాళులర్పించారు. రమేష్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లపై ఆగస్టులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు ఎస్సీ రిజర్వేషన్లు, క్రిమీలేయర్‌కు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో డిసెంబరు 22న లక్షలాది మందితో నిర్వహించే 'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలన్నారు. సంఘం జిల్లా నాయకులు సీహెచ్ ప్రసాద్, ఎస్. రాకేష్, నాగార్జున, శ్రీనివాస్, అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ప్రమాదం

ఒకరికి తీవ్ర గాయాలు★ సహాయ చర్యల్లో మండలి వెంకట్రామ్

పెదప్రోలు(మోపిదేవి): జాతీయ రహదారి - 216పై పెదప్రోలు-కొక్కిలిగడ్డ బస్ షెల్టర్ సమీపంలో శుక్రవారం జరిగిన రహదారి ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, దంపతులకు స్వల్ప గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. రెండు ద్విచక్రవాహనాలు బలంగా ఢీకొనగా బాపట్ల జిల్లా నిజాంపట్నంకు చెందిన చెన్ను శ్రీనివాసరావు తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆ సమయంలో చల్లపల్లి నుంచి అవనిగడ్డ వెళ్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కుమారుడు వెంకట్రామ్ ఆగి 108 వాహనానికి సమాచారం అందించారు. ఆయనతోపాటు కార్యకర్తలు క్షతగ్రాతులకు సేవలందించారు. క్షతగాత్రుడు శ్రీనివాసరావును 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు.

అంతర్ రాష్ట్ర గంజాయి రవాణా ముఠా అరెస్టు

28 కిలోలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

పెనమలూరు, న్యూస్‌టుడే : అంతర్ రాష్ట్ర గంజాయి రవాణా ముఠాను కృష్ణా జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్పీ గంగాధరరావు పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కృష్ణాజిల్లా ఆత్కూరు పోలీసులు గత నెల 28న తేలప్రోలు వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వస్తూ వీరిని గమనించి వాహనం అక్కడే విడిచి పొలాల్లోకి పరారయ్యారు. ఎస్సై సురేష్, సిబ్బంది వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 28 కిలోలున్న గంజాయి బ్యాగులు ఉన్నట్లు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసిన అనంతరం దర్యాప్తు చేపట్టారు. ఆ ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆ ఇద్దరు కేరళ రాష్ట్రం కొచ్చికి చెందిన సాధిక్, ధనుష్‌లుగా గుర్తించారు. వీరికి అదే ప్రాంతానికి చెందిన నియాజ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని ఏర్పాటు చేసి గంజాయి కోసం ఒరిస్సా రాష్ట్రం కోరాపుట్ పంపినట్లు, నియాజ్‌పై కొచ్చిలో ఇప్పటికే గంజాయి రవాణా కేసు ఉన్నట్లు తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో కోరాపుట్‌కు వెళ్లిన సాధిక్, ధనుష్ అక్కడ ఉన్న సాధు, హేమంత్ కిలా అనే వ్యక్తుల నుంచి 28 కిలోల గంజాయిని కొనుగోలు చేసి కొచ్చికి వెళ్తూ కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలు వద్ద వాహనాన్ని విడిచి పరారయ్యారు. ఈ నేపథ్యంలో కేరళకు చెందిన నియాజ్, ఆగస్టిన్, సాధిక్, ధనుష్‌లతో పాటు వీరికి గంజాయిని విక్రయించిన కోరాపుట్‌లోని మావోయిస్టుల ప్రభావ ప్రాంతానికి చెందిన సాధు, హేమంత్ కిలాలను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నియాజ్ విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి సులభంగా నగదు వచ్చే గంజాయి రవాణాను ఎంచుకున్నట్లు ఎస్పీ గంగాధరరావు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన పలువురు అధికారులను ఎస్పీ అభినందించి ప్రోత్సాహకంగా నగదు బహుమతులు అందజేశారు.

మత్తు పదార్థాల విక్రయాలపై ఉక్కుపాదం

పెదపారుపూడి, న్యూస్‌టుడే: గంజాయి విక్రయాలు, వినియోగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పామర్రు సీఐ. వి.శుభాకర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల పెదపారుపూడి మండలంలో గంజాయి పీలుస్తూ పట్టుబడిన 15 మంది నిందితులను అరెస్టు చేసిన విషయం విదితమే. వారితో పాటు వచ్చి పరారైన మేకా ఫణీంద్రను గుడివాడ విజయవాడ రోడ్డులో పెదపారుపూడి వద్ద అరెస్టు చేశామన్నారు. నిందితుని నుంచి 2 కిలోల గంజాయి, ఒక బైకు సీజ్ చేశామన్నారు. ముద్దాయిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు. ఎస్.ఐ. ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


నిందితుడితో సీఐ శుభాకర్, ఎస్.ఐ. ప్రవీణ్ కుమార్

ఇసుక క్వారీలో ఎడ్ల బళ్ల యువకుల ఘర్షణ

కర్రలతో పరస్పరం దాడులు.. నలుగురికి గాయాలు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలంలో రాత్రుళ్లు ఇసుక దందా జోరుగా సాగుతోంది. రొయ్యూరు గ్రామంలో ఇసుక లోడింగ్ కోసం గురువారం రాత్రి ఎడ్ల బళ్లతో పలువురు యువకులు క్వారీకి వెళ్లారు. లోడింగ్ సమయంలో యువకుల మధ్య మాటా మాటా పెరిగి నలుగురు యువకులు పరస్పరం కర్రలతో దాడి చేసుకోవడంతో నలుగురూ గాయపడ్డారు. వారిలో ఇద్దరు పోలీస్ స్టేషన్‌కు రావడంతో ఆస్పత్రికి పంపించామని ఎస్సై అర్జునరాజు తెలిపారు.

ఇసుక దందాకు అడ్డుకట్ట వేసేదెవరు?: తోట్లవల్లూరు మండలంలో రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, కళ్లంవారిపాలెం, దేవరపల్లి, గుర్విందపల్లి, ఐలూరు గ్రామాల్లో ఇసుక క్వారీలున్నాయి. నిత్యం వందలాది ఎడ్ల బళ్ల ద్వారా ఇసుక గ్రామాల్లోకి తీసుకొచ్చి డంపింగ్ చేస్తున్నారు. అక్కడి నుంచి రాత్రుళ్లు జేసీబీలతో ట్రాక్టర్లు, లారీలకు లోడింగ్ చేసి అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఎడ్ల బళ్లలో ఇసుక లోడింగ్ చేసుకొని రాత్రుళ్లు కృష్ణా కరకట్ట మీదుగా వస్తుండగా ద్విచక్ర వాహనదారుడు వెనుక నుంచి ఢీకొట్టి తీవ్ర గాయాలపాలయ్యాడు. దీనిపై తోట్లవల్లూరు తహసీల్దార్ ఎం.కుసుమకుమారి వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా ఇళ్లు కట్టుకునే వారికి మాత్రమే ఎడ్ల బళ్లతో ఇసుక తీసుకెళ్లడానికి అనుమతిస్తామని తెలిపారు. అలా కాకుండా ఎడ్ల బళ్లతో తీసుక తీసుకొచ్చి అక్రమంగా అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఇసుక లోడింగ్‌తో బండి కనిపిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.


గాయపడిన మోర్ల శివసాయి

★మోర్ల శివసాయిని నిక్‌నేమ్‌తో పిలవడంతో ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ ఏర్పడి పరస్పరం కర్రలతో దాడి చేసుకోగా నలుగురికి గాయాలయ్యాయని ఎస్సై అర్జునరాజు తెలిపారు. శివసాయి ఫిర్యాదు మేరకు జశ్వంత్, ఈశ్వర్, చిన్ని, విజయకుమార్, హరిష్‌లపై కేసు నమోదు చేశామని.. జశ్వంత్ ఫిర్యాదు మేరకు మోర్ల శివసాయి, మోర్ల శ్రీరామమూర్తి, లుక్కా హేమద్రి, పామర్తి గిరి, మోర్ల రాజేష్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఈ దాడిలో మోర్ల శివసాయి, శ్రీరామమూర్తి, జశ్వంత్, ఈశ్వర్‌కు గాయాలయ్యాయని చెప్పారు.

లింగ నిర్ధారణ చేస్తున్న ముఠా గుట్టు రట్టు

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: రెండేళ్లుగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ముఠా గుట్టును కామారెడ్డి జిల్లా పోలీసులు రట్టు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ వివరాలు వెల్లడించారు. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలకేంద్రానికి చెందిన బల్ల రవీందర్ ఇంట్లో సీసీఎస్ పోలీసులు, స్థానిక పోలీసులు గురువారం ఆకస్మిక దాడి చేశారు. ఆ సమయంలో రవీందర్ సిద్దిపేట జిల్లా వర్గల్ మండలానికి చెందిన ఓ గర్భిణికి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇతడికి రాజంపేటలోని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, కామారెడ్డిలోని కౌసల్య ఆసుపత్రిలో లింగ నిర్ధారణ పరీక్ష కేంద్రాల్లో పనిచేసిన అనుభవం ఉంది. కౌసల్య ఆసుపత్రి 2021లో మూతపడడంతో రవీందర్ అక్రమ మార్గాల్లో డబ్బు సంపాదించాలనే దురాలోచన చేశాడు.

అంతర్జాలంలో వివరాలు సేకరించి..: అంతర్జాలంలో అల్ట్రాసౌండ్ నిర్ధారణ యంత్రం కోసం రవీందర్ వివరాలు తెలుసుకున్నాడు. యంత్రం కొనుగోలు కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ అర్బన్ ప్రాంతంలోని గాంధీనగర్ (కుదుస్‌నగర్)కు చెందిన పాత యంత్రాలను అమ్మే 'సామ్ మెడికల్ సిస్టమ్' డైరెక్టర్ పోతల సామ్‌సన్‌ను సంప్రదించాడు. రవీందర్‌కు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో సదరు యంత్రాన్ని సామ్‌సన్ ఎక్కువ ధరకు విక్రయించాడు. ఈ యంత్రాన్ని అమ్మేందుకు కృష్ణా జిల్లా చింతలపూడి అప్పారం వీధి ప్రకాష్‌నగర్ సుందరయ్యనగర్‌కు చెందిన చింతలపూడి దుర్గాప్రసాద్ సహకరించాడు. ఇలా కొనుగోలు చేసిన యంత్రంతో రవీందర్ రెండేళ్లుగా తన ఇంట్లోనే లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాడు.

సహకరించిన ఆర్‌ఎంపీలు: రవీందర్‌కు ఆర్‌ఎంపీలు సహకరించారు. ఇలా సహకరించిన రామారెడ్డి మండలం గిద్దలో ఆర్‌ఎంపీగా పనిచేస్తున్న బోయిని యాదగిరి (కామారెడ్డి పంచముఖీ హనుమాన్‌కాలనీ నివాసి), దోమకొండ మండలం గొట్టిముక్కులలో ఆర్‌ఎంపీగా పనిచేస్తున్న బక్కి ప్రవీన్‌కుమార్(కామారెడ్డి మండలం నర్సన్నపల్లి నివాసి)లను పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. రవీందర్ వినియోగించిన అల్ట్రా సౌండ్ యంత్రం, దానికి ఉపకరించే కేబుళ్లు, చరవాణిని జప్తు చేసినట్లు ఎస్పీ చెప్పారు. ఈ కేసును విచారిస్తున్నామని, ఇంకా ఎవరి పాత్ర అయినా ఉన్నట్లు తేలితే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. రవీందర్ వద్ద లింగ నిర్ధారణ పరీక్షల కోసం ఏయే ఆసుపత్రుల నుంచి ప్రతిపాదించారనే కోణంలో సైతం విచారణ కొనసాగుతోందన్నారు. సమావేశంలో ఏఎస్పీ నర్సింహారెడ్డి, కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు తదితరులున్నారు.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: ఉచిత డీఎస్సీ శిక్షణ అందించేందుకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి షేక్ షాహిద్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలోని సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఉన్న స్టడీ సర్కిల్స్‌లో ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 12 నుంచి 21వ తేదీలోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ 27న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తామని, వారిలో అర్హులైన అభ్యర్థులకు మెరిట్ లిస్ట్ ప్రకారం ఉచిత శిక్షణ అందించేందుకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.



నివాళులు అర్పిస్తున్న మిత్ర మండలి సభ్యులు

ఘనంగా జయప్రకాష్ నారాయణ జయంతి

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని గొడుగుపేటలో నేతాజీ మిత్ర మండలి ఆధ్వర్యంలో లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మిత్ర మండలి కోకన్వీనర్ ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ కరుడుగట్టిన బందిపోటు దొంగల్లో సైతం పరివర్తన తీసుకొచ్చి జన స్రవంతిలోకి తీసుకొచ్చిన గొప్ప సామాజికవేత్త అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ నియంత పోకడలను ఎదిరించి దేశవ్యాప్త ఉద్యమం చేపట్టిన ఉద్యమకర్త అన్నారు. నేటితరం రాజకీయ నాయకులు ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మిత్ర మండలి సభ్యులు రాజశేఖర్, వీవీ పణికుమార్, కొండా ప్రసాద్, శర్మ, జయప్రసాద్, విస్సకోట సుబ్బారావు, జీవన్‌ర్ మూర్తి తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

పైవంతెన తెచ్చిన కష్టాలు!

మూడేళ్లుగా పూర్తికాని ఆర్వోబీ ❖ జాతీయ రహదారిపై వాహనదారుల అవస్థలు

న్యూస్‌టుడే, పెడన

216 జాతీయ రహదారిపై పెడనలో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కత్తిపూడి-ఒంగోలు మధ్య నిర్మించిన ఈకోస్తా జాతీయ రహదారిపై మూడేళ్ల కిందట ప్రారంభించిన పై వంతెన(ఆర్వోబీ) పనులు అసంపూర్తిగా నిలిచి కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. జాతీయ రహదారిపై ఈ అవస్థలు ఏమిటంటూ వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒంగోలు-కత్తిపూడి మధ్య దూరం తక్కువ కావడంతో 216 జాతీయ రహదారిపై ట్రాఫిక్ గణనీయంగా పెరిగింది. పెడన మీదుగా రోజుకు 20వేలకు పైగా వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. విజయవాడ, హైదరాబాద్‌ల నుంచి భీమవరం, నర్సాపురం, అమలాపురం, రాజోలు వెళ్లే వాహనదారులు కూడా ఈ రహదారిపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. అయితే మచిలీపట్నం-విజయవాడ రైల్వే ట్రాక్‌పై పెడన వద్ద 2021లో పై వంతెన నిర్మాణాన్ని చేపట్టారు. ఈ వంతెన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవటంతో పెడన రైల్వే గేటు వద్ద రైళ్ల రాకపోకల సమయంలో వందల వాహనాలు గేటుకు రెండు వైపులా నిలిచిపోతున్నాయి. పైవంతెన కింద నుంచి నర్సాపురం వైపు వెళ్లే వాహనాలకు అండర్ పాస్‌ను నిర్మించారు. ఈ అండర్ పాస్ నుంచి భారీ వాహనాలు వెళ్లే వెసులుబాటు లేక పెడన పట్టణంలోకి ప్రవేశిస్తున్నారు. ఫలితంగా పట్టణంలో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభిస్తోంది.


జాతీయ రహదారిపై రైల్వేగేటు వద్ద వాహనాల రద్దీ



మచిలీపట్నం రోడ్డులో అండర్‌పాస్ వద్ద స్తంభిస్తున్న ట్రాఫిక్


రైల్వే ట్రాక్‌పై అసంపూర్తిగా బ్రిడ్జి నిర్మాణం


ఎక్కడి పనులు అక్కడే..

పైవంతెనకు రెండు వైపులా అప్రోచ్ రోడ్ల నిర్మాణం నిలిచిపోయింది. రైల్వే ట్రాక్‌పై వంతెన నిర్మాణాన్ని కూడా నిలిపివేశారు. దాదాపు కిలోమీటరుకు పైగా పొడవు ఉండే ఈ ఆర్వోబీను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం కారణంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. జాతీయ రహదారిపై ఆర్వోబీలు ఇతర ప్రాంతాల్లో పూర్తికాగా పెడనలోనే నిలిచిందని వాహనదారులు నిరసిస్తున్నారు. దీనిపై జాతీయ రహదారుల సంస్థ అధికారి స్పందిస్తూ కాంట్రాక్టర్‌కు ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, త్వరలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముదినేపలి: శ్రీహరిపురం శివారు చేవూరుపాలెం పరిధిలోని పెట్రోలు బంక్ వద్ద ఈ నెల 6న రాత్రి ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో గాయపడిన సుబ్రహ్మణ్యం (26) చికిత్స పొందుతూ మృతి చెందాడు.



పెదతుమ్మిడి శివాలయంలో మహిషాసురమర్దినిగా..


ధనలక్ష్మిగా లలితామ్మవారు..


గూడూరు: ఐదుగుళ్లపల్లిలో..


బంటుమిల్లి : కనకదుర్గమ్మ ఆలయంలో..


బంటుమిల్లి : పెదతుమ్మిడి రామాలయంలో..



పెడన: మహిషాసురమర్దినిగా పైడమ్మ తల్లి

శక్తిరూపిణి.. లోకపావని..

మచిలీపట్నం (గొడుగుపేట), గూడూరు, మచిలీపట్నంరూరల్, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, న్యూస్‌టుడే:

మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లోని ఆయా దేవాలయాలతో పాటు వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన ఉత్సవ మండపాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు.


కోకనారాయణపాలెంలో ఎమ్మెల్యే కాగిత పూజలు


మాట్లం విజయ కనకదుర్గమ్మ ఆలయం ఎదుట సామూహిక కుంకుమార్చనలు


బందరులో ధైర్యలక్ష్మిగా..



సుల్తానగరంలో మహిషాసురమర్దినిగా..


పోతేపల్లిలో..


మంగినపూడిలో సిదిధాత్రిదేవిగా..


పెడన: కన్యకాపరమేశ్వరీ ఆలయంలో.


కృత్తివెన్ను: నాగేశ్వరస్వామి ఆలయంలో..


బందరు: మహిషాసురమర్దినిగా..

నష్టపరిహారం అందరికీ అందించాలి

బంటుమిల్లి: ఇటీవల సంభవించిన వరదలు, అధిక వర్షాల కారణంగా నష్టపోయిన రైతు, కౌలు రైతులకు ఇంకా పరిహారం అందని వారికి వెంటనే వారి ఖాతాల్లో నష్ట పరిహారం జమ చేయాలని రైతు సంఘం నాయకులు అన్నారు. స్థానిక గుండాబత్తుల ఆంజనేయులు స్మారక భవనంలో శుక్రవారం మండల స్థాయి రైతు సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వరదల కారణంగా చనిపోయిన మృతులకు సంతాపం తెలియజేస్తూ మౌనం పాటించారు. అనంతరం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడలోని ఎంబీబీకే భవన్‌లో వ్యవసాయరంగ సమస్యలపై జరిగే జాతీయ సదస్సుకు రైతులు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. బంటుమిల్లి ప్రధాన కాలువ పరిధిలో దాళ్వా వరి సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా అన్నదాతా సుఖీభవ పథకం కింద రైతులకు రూ.25 వేలు అందించాలని తెలిపారు. మల్లిశెట్టి శివరాంప్రసాద్, లంకదాసుల అజయ్‌ఘోష్, సుజ్ఞానం జనార్ధనరావు, జి.వీరబాబు, సుంకర వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.


బంటుమిల్లిలో రైతు సంఘం సమావేశంలో నాయకులు తదితరులు

కలంకారీ అందాలు

- పరిశ్రమకు సందర్శకుల తాకిడి
- దసరా సెలవులతో రద్దీ

న్యూస్‌టుడే, పెడన

హస్తకళల పరిశ్రమ కలంకారీకి సందర్శకుల తాకిడి పెరుగుతోంది. దసరా సెలవులతో తెలుగు రాష్ట్రాల నుంచి సందర్శకులు పెడనకు తరలివస్తున్నారు. ఫ్యాషన్ ప్రపంచంలో కలంకారీకి ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఈ హస్తకళలు రూపుదిద్దుకునే ప్రక్రియను తిలకించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కలంకారీ ప్రక్రియ ఉదయం 5గంటల నుంచి ప్రారంభమవుతుంది. ప్రవాహపు నీటిలో వస్త్రాలను శుభ్రపర్చటం, కరక్కాయల రసాన్ని క్లాత్‌కు పట్టించటం, వస్త్రాలను ఉడకబెట్టడం తదితర ప్రక్రియలు ఉదయం ప్రారంభమై మధ్యాహ్నానికి ముగుస్తాయి. ఈ నేపథ్యంలో ఉదయం 7గంటల నుంచే సందర్శకులు తరలివస్తున్నారు. ఇక్కడి కళాకారుల చేతిలో రూపుదిద్దుకుంటున్న వివిధ రకాల చీరలు, డ్రెస్ మెటీరియల్స్, ఫర్నిషింగ్‌లకు మంచి ఆదరణ లభిస్తోంది. నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్న ఉత్పత్తిదారులకు డిమాండ్ పెరుగుతోంది. ఈ హస్తకళలపై ప్రాజెక్టును రూపొందించేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థులు పెడన వచ్చి ఇక్కడే 15 రోజుల పాటు అధ్యయనం చేస్తున్నారు. కలంకారీకి డిజైన్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తే రానున్న రోజుల్లో పరిశ్రమ మరింతగా పురోభివృద్ధి సాధిస్తుందని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి.


కలంకారీ హస్తకళలను తిలకిస్తున్న ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థులు


రామరాజుపాలెం కాలువ గట్టున వస్త్రాలు ఆరబెడుతున్న కార్మికులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందనకు వందనం

నగరంలోని బైపాస్ రహదారి వెంబడి ఉన్న డ్రైన్‌లో పూడిక తీసిన మేటతో పాటు వ్యర్థాలు అక్కడే వదిలేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానికులు 'మేమున్నాం మీకుతోడుగా' దృష్టికి తీసుకురాగా అధికారులకు వివరించడంతో వెంటనే స్పందించి యంత్ర సాయంతో రోడ్డు వెంబడి ఉన్న వ్యర్థాలు, సిల్టును తొలగించి శుభ్రం చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారం కావడంపై ఆ ప్రాంతవాసులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


యంత్ర సాయంతో రోడ్డు పక్కనున్న వ్యర్థాలు తొలగిస్తూ..

? పరాసుపేట ప్రాంతంలోని సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాల మరుగుదొడ్లను ప్రహరీకి అనుసంధానించి కట్టి వాటి ఎగ్జాస్టర్ ఫ్యానులను మా ఇంటి వైపు పెట్టడంతో దుర్వాసన వస్తోంది. **-రాధ, పరాసుపేట**

✔ సిబ్బందిని పంపి పరిశీలించి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. -బాపిరాజు, నగర పాలక సంస్థ కమిషనర్ **-మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే**


మరుగుదొడ్ల ఎగ్జాస్టర్లను ఇంటివైపు పెట్టారిలా..

దారంతా గతుకులు.. ప్రయాణికుల బెంబేలు

పల్లెదారులు అధ్వానంగా మారాయి. గుంతలతో, గజానికో అతుకుతో వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. అరిశేపల్లి-చిట్టిపాలెం మధ్య మూడు కి.మీ రహదారి అడుగుకో గుంతతో దర్శనమిస్తోంది. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. చిట్టిపాలెం- హుస్సేన్‌పాలెం రహదారి, పోతేపల్లి రహదారి అధ్వానంగా మారాయి. అధికారులు రహదారులను నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. **-అరిశేపల్లి (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే**


చిట్టిపాలెం-అరిశేపల్లి మధ్య గుంతల దారి

విద్యుత్తు అంతరాయాలు చెప్పేదెలా..

న్యూస్‌టుడే, పెడన : పెడన పట్టణంలో విద్యుత్తు ఫ్యూజ్ ఆఫ్ కాల్ కార్యాలయం వినియోగదారులకు సేవలు అందించడంలో వెనుకంజ వేస్తోంది. పట్టణంలోని 10వేల సర్వీసులకు స్థానిక బస్టాండు సెంటరులోని ఫ్యూజ్ ఆఫ్ కాల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయంలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెడనలో బాధ్యతలు నిర్వర్తించే సిబ్బంది అత్యధికంగా మచిలీపట్నంలో నివాసం ఉంటూ రాకపోకలు సాగిస్తుంటారు. సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే సాధారణంగా ఫ్యూజ్ ఆఫ్ కాల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలి. కానీ ఇక్కడ సిబ్బంది అందుబాటులో లేకపోవడం, మొబైల్ నంబర్లు ప్రదర్శించకపోవడంతో ఫిర్యాదు చేయడం ఇబ్బందికరంగా మారింది.

166 బస్తాల చౌక బియ్యం స్వాధీనం

గొడుగుపేట (మచిలీపట్నం), న్యూస్‌టుడే: మచిలీపట్నంలోని ఇనగుదురుపేట చింతచెట్టు సెంటర్‌లో ఒక ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 166 బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పీడీఎస్ డీటీ సుభాన్‌బి మాట్లాడుతూ ఒక ఇంటిలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు జేసీ కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు చేశామన్నారు. కందుల జయబాబు ప్రజల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఎక్కువ మొత్తానికి బయట విక్రయిస్తుంటారని తెలిసిందన్నారు. గతంలో కూడా ఇతనిపై పలు కేసులు నమోదయ్యాయన్నారు. 166 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేస్తున్నట్లు చెప్పారు.

బాలికలు మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలి



కలెక్టరేట్‌లో విజేతలతో అధికారులు, కుటుంబీకులు

మచిలీపట్నం (గొడుగుపేట), గూడూరు, న్యూస్‌టుడే: బాలికలు మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకుని ధైర్యంగా ముందుకు సాగాలని ఐసీడీఎస్ పీడీ ఎస్.సువర్ణ అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికలకు రక్షణగా అనేక చట్టాలు ఉన్నాయని, ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తుందన్నారు. వాటిపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు వివరించి వాటికి అడ్డుకట్ట వేయడం అందరి బాధ్యత అని చెప్పారు. ఆమెతో పాటు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఝాన్సీ తదితరులు ప్రసంగించారు. వివిధ రంగాల్లో ప్రతిభ చాటుకుంటున్న బాలికలకు పురస్కారాలు అందజేశారు. ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. బందరు మండలం చిన్నాపురం పీహెచ్‌సీ, గూడూరు మండలం మల్లవోలు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. బాలికల కోసం అమలు చేస్తున్న పథకాలు, అందుబాటులో ఉన్న అవకాశాలు వివరించారు.

గుడివాడ
•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ


వితరణ అందజేస్తున్న దుర్గాశివప్రసాద్, నాగభరత్

ఆలయ అభివృద్ధికి విరాళం

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాల, దేవరకోట ఇలవేల్పయిన కోట ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.57,500 విరాళం ఘంటసాలపాలెంనకు చెందిన వేమూరి దుర్గాశివ ప్రసాద్, ఆయన కుమారుడు నాగభరత్ ఆలయ ట్రస్టీ వేమూరి ప్రవీణ్‌కు శుక్రవారం అందజేశారు. ఆలయంలో వారు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆస్పత్రికి ఫొటో థెరపీ యంత్రం వితరణ

కూచిపూడి, న్యూస్‌టుడే: పమిడిముక్కల మండలం పెనుమత్స గ్రామానికి చెందిన యార్లగడ్డ సుభాష్‌చంద్రబోస్, వెంకట అన్నపూర్ణ దంపతులు రూ.60 వేలు విలువైన ఫొటో థెరపీ యంత్రాన్ని శుక్రవారం అందజేశారు. వైద్యశాల సలహామండలి సభ్యుడైన ఆయన ఏవో హనుమకుమార్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పరసురామ్‌కు ఈ యంత్రాన్ని అందించారు.


యంత్రం అందజేస్తున్న సుభాష్‌చంద్ర బోస్ దంపతులు

400 మంది వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

నందివాడ(గుడ్లవల్లేరు) : నందివాడ మండలం పెదలింగాల రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం దివంగత తుమ్మల సూర్యనారాయణ, నిర్మలాదేవిల జ్ఞాపకార్థం వారి కుమారుడు తుమ్మల మురళీకృష్ణ, బోయపాటి సత్యం రూ. లక్షతో 400 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా గుడివాడ అర్బన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ పిన్నమనేని బాబ్జి పాల్గొని వాటిని పేదలకు అందజేశారు. తెదేపా నాయకులు తాతినేని మురళి, గండికోట రాంబాబు, చింతా కమలయ్య, మద్దాల రాజేశ్, కలపాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు అందజేస్తున్న పిన్నమనేని బాబ్జి, దాతలు


చల్లపల్లిలో..


అవనిగడ్డ శివాలయంలో..


కొత్తపేటలో..


వేకనూరులో..


అవనిగడ్డ మండలం మోదుమూడిలో..

దుష్టసంహారిణి.. మహిషాసురమర్దిని

దేవీ శరన్నవరాత్రులు 9వ రోజైన శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దినీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గుడివాడ, పామర్రు, అవనిగడ్డ నియోజకవర్గాల్లోని దేవాలయాలు, పండపాల వద్ద అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి దంపతులు ఉభయదాతలుగా ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

☛ చల్లపల్లి మండలం నడకుదురులోని అంకమ్మతల్లి ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. మురాల మన్మథరావు రూ. 50 వేల ఆర్థిక సాయం అందించారు. ☛ గుడివాడ పండ్ల వర్తకుల సంఘం ఆధ్వర్యంలో రైతు బజారు వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు రెండు వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు.

- న్యూస్‌టుడే బృందం


కోడూరు మండలం మందపాకలలో..



గుడివాడ భీమేశ్వరస్వామి దేవస్థానంలో..


గుడివాడ : అన్నసమారాధనలో వడ్డిస్తున్న మాజీ కౌన్సిలర్ గోకరకొండ బలరామ్


చిట్టూర్పులో..


ఘంటసాల జలధీశ్వర స్వామి ఆలయంలో..


మోపిదేవి : కొక్కిలిగడ్డలో..


పెదపారుపూడి: వెంట్రప్రగడలో..


పమిడిముక్కలలో..


చిన ఎరుకపాడులో..


కూచిపూడిలో..


భావదేవరపల్లిలో గాజుల అలంకరణలో ఆదిలక్ష్మి అమ్మవారు


మొవ్వలో రాజ్యలక్ష్మి


నిడుమోలు లాకుల వద్ద


తోట్లవల్లూరులో..


నాగాయలంకలో గంగానమ్మ..


గణపేశ్వరంలో..


నాగాయలంకలో యల్లారమ్మ..


కన్యకాపరమేశ్వరి అమ్మవారు


పామర్రు : పార్వతీదేవి


కొండిపర్రు భ్రమరాంబ

ప్రజోపయోగ పనులకు అంచనాలు రూపొందించండి

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్న దృష్ట్యా గుడివాడ పురపాలక అధికారులు ప్రజా అవసరాలను బట్టి అంచనాలు రూపొందించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. స్థానిక ప్రజా వేదికలో శుక్రవారం ఆయన పురపాలక అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల్ని దృష్టిలో ఉంచుకుని ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. జల్ జీవన్ మిషన్ పనుల్లో అధికారుల నిర్లక్ష్య ధోరణి సహించేది లేదన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ సహాయ కమిషనర్ పి.శ్రీనివాస్, డీఈలు సతీష్ చంద్ర, వరప్రసాద్, ఏఈలు ప్రభాకర్, తేజస్విని, జ్వాలా దీప్తి, పాండు రంగారావు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రాము, తదితరులతో ఎమ్మెల్సీ శ్రీకాంత్

గుడివాడ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడను అభివృద్ధి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. గుడివాడలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన శ్రీకాంత్ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే గుడివాడ అత్యంత ప్రాముఖ్యత కలిగిన నియోజకవర్గమన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, తెదేపా నాయకుడు చేకూరు జగన్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి సాధారణ విద్యతోపాటు వృత్తి విద్యాకోర్సులపై అవగాహన ఉండాలని.. అప్పుడే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఒకేషనల్ విద్య జేసీటీ సీతామహాలక్ష్మి చెప్పారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సులపై 9 రోజులుగా వివిధ మోటార్ల సైకిల్ షోరూంలలో ఇస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసిన సందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వృత్తి విద్యా కోర్సుల జిల్లా కోఆర్డినేటర్ రవికాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీఎస్.గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు

తెలుగురావుపాలెం(ఘంటసాల), న్యూస్‌టుడే: తెలుగురావు పాలెం పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం విజయవాడ సెంటినీ ఆసుపత్రి, బదేని చర్చి సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం డాక్టర్ పెదబాబు, డాక్టర్ ఎ.మధు ఆధ్వర్యంలో 150 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 18 మందికి సోమవారం శస్త్ర చికిత్సలు చేస్తామని వైద్యులు పేర్కొన్నారు. సర్పంచి ప్రసాదరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

☛ ఘంటసాల రిటైర్‌వాలి గూడెంలో అవనిగడ్డ వాసన్ కంటి ఆసుపత్రి ఎండీ డాక్టర్ కె.కిషోర్‌రాజు ఆధ్వర్యంలో నేత్ర వైద్యులు కె.నాగరాజు 120 మందికి నేత్ర వైద్యపరీక్షలు నిర్వహించారు. 15 మందికి త్వరలో శస్త్రచికిత్సలు చేస్తామని వైద్యులు పేర్కొన్నారు.

మద్యం దుకాణాలకు 360 దరఖాస్తులు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: నూతన మద్యం దుకాణాల కోసం దరఖాస్తుల ఆహ్వానంలో అవనిగడ్డ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, మోపిదేవి మండలాల్లో మంజూరు చేసిన 11 దుకాణాలకు మొత్తం 360 దరఖాస్తులు వచ్చినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సీఐ గిరిజాకుమారి చెప్పారు. అత్యధికంగా 26వ నంబరు దుకాణానికి 41 దరఖాస్తులు, అత్యల్పంగా 34వ నంబరు షాపునకు 26 దరఖాస్తులొచ్చాయి. అవనిగడ్డ మండలంలో 2 దుకాణాలకు 57, కోడూరులో 3కి 101, నాగాయలంకలో 3కి 115, మోపిదేవిలో 3కి 87 దరఖాస్తులు దాఖలయ్యాయి.

మొవ్వ పరిధిలో 274

కూచిపూడి, తోట్లవల్లూరు: మొవ్వ పరిధిలోని మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో 11 దుకాణాలకు 274 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ బి.వరలక్ష్మి తెలిపారు. మొవ్వ మండలంలో 4 దుకాణాలకు 75, ఘంటసాలలో 3కి 84, చల్లపల్లిలో 4కి 115 చొప్పున దరఖాస్తులు అందాయన్నారు. పామర్రు నియోజకవర్గంలో పామర్రు మండలంలో 4 దుకాణాలకు 47 టెండర్లు, పెదపారుపూడిలో 4కి 38, పమిడిముక్కలలో 3కి 84, తోట్లవల్లూరులో 3కి 58 దరఖాస్తులు దాఖలయ్యాయి.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నం: డీఎస్సీ ఉచిత శిక్షణ అందించేందుకు అర్హులైన ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి షేక్ షాహిద్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

రతన్ టాటా మృతి తీరని లోటు



టాటా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వేలేరు గ్రామస్థులు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : దేశం గర్వించదగ్గ పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతి తీరని లోటని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం వేలేరు మండపంలో టాటా చిత్రపటానికి గ్రామస్థులు నివాళులర్పించారు. పాతూరి కొండలరావు, సురేష్, సీతారామయ్య, శివనాగ మల్లేశ్వరరావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట



పాడి రైతుకు బోనస్ అందిస్తున్న నరేంద్ర, వెంకటేశ్వరరావు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : రైతుల ఆర్థికాభివృద్ధికి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలతో పాటు కృష్ణామిల్క్ యూనియన్ పెద్దపీట వేస్తోందని విజయా డెయిరీ క్లస్టర్ మేనేజర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని దావాజీగూడెం పాల సొసైటీ ఆధ్వర్యంలో పాడి రైతులకు సొసైటీ అధ్యక్షుడు గొంది నరేంద్ర అధ్యక్షతన 142 మందికి రూ.4.70 లక్షల నగదును బోనస్‌గా పంపిణీ చేశారు. అత్యధికంగా గేదె, ఆవు పాలను సరఫరా చేసిన నలుగురు రైతులకు వెండి నాణెలు, మరో వంద మందికి వెట్ గ్రైండర్లను బహుమతిగా అందించారు.

మార్కెట్ యార్డుకు మంచి రోజులు

- అభివృద్ధిపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం
- ఐదు రోజులుగా ఆవరణ బాగుచేత పనులు

కంకిపాడు, పెనమలూరు, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కంకిపాడులో ఉన్న పెనమలూరు మార్కెట్ యార్డు(ప్రధాన కేంద్రం)కు మంచి రోజులు వచ్చాయి. సుమారు రూ.100 కోట్ల విలువైన 10 ఎకరాల ప్రాంగణం గత ఐదేళ్లుగా ముళ్ల పొదళ్లు, పిచ్చిమొక్కలతో చిట్టడవిలా ఉండేది. నామమాత్రపు పనులు చేపట్టినా నాలుగు రోజులకే సమస్య మొదటికి వచ్చేది. గత ఐదు రోజులుగా ఆవరణను బాగు చేస్తున్నారు. ఎండిన చెట్లు, కొమ్మలను తొలగిస్తున్నారు. ఏళ్ల తరబడి చిమ్మ చీకటిలో మగ్గిన యార్డులో విద్యుత్తు దీపాల వెలుగులు కనపడుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వంలో ఈ పనులు చేపట్టడానికి అనుమతి.. ఆ తర్వాత బిల్లుల చెల్లింపుపై భరోసా లేకపోవడమే కారణంగా తెలుస్తోంది.



అందుబాటులోకి వచ్చిన వాహనాల తూకం యంత్రం

వాహనాల తూకం యంత్రం

పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో వాహనాల తూకం యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రధానంగా వ్యవసాయ ఉత్పత్తులు, వాటి రవాణాకు ఉపయోగించే వాహనాల బరువు నిర్ధారించుకోడానికి ఉపయోగ పడుతుందని చెబుతున్నారు. ఆయా సీజన్లలో ధాన్యం, మొక్కజొన్న, పసుపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. యంత్రం అందుబాటులో ఉండడంతో రైతులు, వాహనదారుల వ్యయప్రయాసలు తొలగిపోతాయని భావిస్తున్నారు.

మార్కెట్ యార్డు పరిధిలో వివరాలు

- మండలాలు - పెనమలూరు, కంకిపాడు
- గ్రామాలు - 30
- సాగు విస్తీర్ణం - సుమారు 35 వేల ఎకరాలు
- రైతులు, పశు పోషకుల సంఖ్య - సుమారు 30వేలు
- ప్రధాన పంటలు - వరి, చెరకు, పసుపు, కూరగాయలు
- వార్షికాదాయం - రూ.2.5 కోట్లు
- వ్యవసాయ చెక్‌పోస్టులు - ఆరు
- ఖరీఫ్ సీజన్‌లో - పది
- ఉద్యోగులు - కార్యదర్శి, పర్యవేక్షకులు, పొరుగు సేవల సిబ్బంది 20

త్వరలో కొత్త పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ఏఎంసీ కొత్త పాలకవర్గం జాబితా ఖరారైనట్లు తెలుస్తోంది. దీనిలో ఛైర్మన్, వైస్-ఛైర్మన్ సహా 20 మంది సభ్యులుంటారు. ఈ నెలలోనే ప్రమాణ స్వీకారం ఉంటుందని చెబుతున్నారు.

★ **అందుబాటులో ఉన్న గిడ్డంగులు:** మొత్తం నాలుగు కాగా వీటిలో ఒకటి మినీపాల ప్రాజెక్టుకు, మరో రెండు అద్దెకు ఇవ్వగా ఒక్కటి మాత్రమే రైతులకు ఉపయోగపడుతోంది. సుమారు వంద పశువుల వసతి కల్పించే రెండు షెడ్లు, ఓపెన్ ప్లాట్‌ఫారం, ఏఎంసీ కార్యాలయం, రైతు సదస్సుల నిర్వహణకు విశాలమైన షెడ్డు, అధునాతన పరికరాలతో వ్యవసాయ, మత్స్య ప్రయోగశాల ఉన్నాయి.



పిచ్చిమొక్కలు తొలగించిన తర్వాత ప్రాంగణం

వెల్లివిరిసిన మత సామరస్యం



భక్తులకు అల్పాహారం పంపిణీ చేస్తున్న ముస్లింలు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల నేపథ్యంలో హనుమాన్ జంక్షన్‌లో మత సామరస్యం వెల్లివిరిసింది. సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన విజయవాడ ఇంద్రకీలాద్రికి వెళ్తున్న భక్తుల సౌకర్యార్థం జనసేన గ్రామ అధ్యక్షుడు షేక్ అహ్మద్ నేతృత్వంలో ముస్లిం సోదరులు స్థానిక నారాయణ పాఠశాల వద్ద శుక్రవారం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. తాగునీరు, వివిధ రకాల పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చలమలశెట్టి రమేష్, మండల అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, పలువురు నాయకులు శిబిరాన్ని ప్రారంభించారు.

సేద తీరుతున్న భవానీ భక్తులు



భవానీలకు భోజనం వడ్డిస్తూ..

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : భవానీ దీక్ష విరమణ కోసం సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన విజయవాడ ఇంద్రకీలాద్రికి వెళ్తున్న పలువురు భక్తులు బొమ్ములూరు వద్ద సేద తీరుతున్నారు. వీరి సౌకర్యార్థం పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో నిరంతరాయంగా అల్పాహారం, భోజనం అందిస్తున్నారు. శుక్రవారం ఈ శిబిరంలో సతీష్‌కుమార్ కుటుంబ సభ్యులు భవానీలకు ఆహారం పంపిణీ చేశారు



హనుమాన్ జంక్షన్‌లో..



కన్యకాపరమేశ్వరి మందిరంలో...



ఉయ్యూరు శివాలయంలో..



ఆత్కూరులో..



యనమలకుదురు: కనకదుర్గానగర్‌లో...

మహిషాసురమర్దనీ పాహిమాం

పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారు శ్రీమహిషాసురమర్దనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ మండపాలు, వివిధ ఆలయాల్లోనూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. **-న్యూస్‌టుడే, బృందం**



కానూరు: తులసీనగర్‌లో..



దావులూరులో..



రామవరప్పాడులో..



పోరంకి: విష్ణుపురం కాలనీలో..



కాటూరులో భోజనం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్సీ వైవీబీ

ప్రశాంతంగా మద్యం దుకాణాల టెండర్లు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : గన్నవరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినట్లు ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస చౌదరి తెలిపారు. స్థానిక రోటరీ క్లబ్ కల్యాణ మండపంలో దరఖాస్తుల ప్రక్రియను సీఐ సురేఖతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. మొత్తం 23 దుకాణాలకు గాను 453 అర్జీలు వచ్చినట్లు చెప్పారు.

ఉయ్యూరు సర్కిల్‌లో 755 దరఖాస్తులు

ఉయ్యూరు, న్యూస్‌టుడే : ఉయ్యూరు ఎక్సైజ్ సర్కిల్ పోలీసు స్టేషన్ పరిధిలోని 30 మద్యం దుకాణాలకు గాను 755 దరఖాస్తులు వచ్చాయని సర్కిల్ ఇన్‌స్పెక్టరు శేషగిరిరావు తెలిపారు.

